ప్రజాశక్తి

శనివారం 12 అక్టోబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

కాసు(చి)ల్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మద్యం దుకాణాలకు దరఖాస్తుల దాఖలు ప్రక్రియ శుక్రవారం రాత్రి ముగిసింది. గుంటూరు జిల్లాలో 4421, పల్నాడు జిల్లాలో 2577 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి తక్షణం ఈ రెండు జిల్లాల నుండి రూ.139.98 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఆదాయం ప్రభుత్వ ఖాజానకు చేరుతుంది. ఒక్కో దుకాణానికి దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు చెల్లించారు. ఈ సొమ్ము తిరిగి ఇచ్చే అవకాశం లేకుండా నిబంధన పెట్టారు. తద్వారా ప్రభుత్వానికి రూ.138.98 కోట్ల ఆదాయం సమకూరింది. గుంటూరు జిల్లా కంటే పల్నాడు జిల్లాలో దరఖాస్తులు తక్కువ రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా మాచర్ల, చిలకలూరిపేటలో సిండికేట్ల ప్రభావంతో దరఖాస్తుల సంఖ్య బాగా తగ్గింది. గుంటూరు

▶ 2లో



ప్రత్తిపాడులో టెండర్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్ఐ రవీంద్రబాబు

- మద్యం దరఖాస్తులతోనే రెండు జిల్లాల్లో రూ.139.98 కోట్ల ఆదాయం
- గుంటూరు జిల్లాలో అధికంగా పోటీ - పల్నాడు జిల్లాలో తక్కువ
- మాచర్ల, చిలకలూరిపేటలో సిండికేట్?
- 14న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు

బాలలు పనుల్లో కాదు బడుల్లో ఉండాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బాలలు పాఠశాలలకు వెళ్లాలేగాని వారు కార్మికులుగా మారకూడదని జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు వెట్టిచాకిరి, బాల కార్మికుల స్పెషల్ డ్రైవ్ 'ఆపరేషన్ స్వేచ్ఛ చైల్డ్

▶ 2లో

కాసు(చి)ల్

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో 127 దుకాణాలకు 4421 దరఖాస్తులు రాగా పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు 2577 మాత్రమే వచ్చాయి. చిలకలూరిపేటలో 17 దుకాణాలకు కేవలం 189 వచ్చాయి. క్రోసూరులో 10 దుకాణాలు ఉండగా 313 దరఖాస్తులు వచ్చాయి. మాచర్లలో 10 దుకాణాలకు కేవలం 117 రావడం చర్చనీయాంశంగా మారింది. ఈపూరు మండలంలో 9 దుకాణాలకు 238 దరఖాస్తులు వచ్చాయి. పెదకూరపాడులో 10 దుకాణాలకు 248 రాగా మునిసిపల్ పట్టణాలు ఉన్న చిలకలూరిపేట, మాచర్లలో తక్కువ దరఖాస్తులు రావడం విశేషం. ఈ రెండు నియోజకవర్గాల్లో సిండికేట్ల ప్రభావం ఉంటుందని తెలుస్తోంది.

గుంటూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వ్యాపారుల మధ్య విపరీతమైన పోటీ ఏర్పడింది. జిల్లాలో కేవలం 127 దుకాణాలకు 4421 దరఖాస్తులు రాగా సగటున 34.81 శాతం దరఖాస్తుదారుల మధ్య పోటీ ఏర్పడింది. గుంటూరు నగరంతోపాటు తాడికొండ, మంగళగిరిలో పోటీ భారీగా ఉంది. తెనాలిలో పోటీ కొంత తక్కువగా ఉంది. ఈనెల 14న గుంటూరు, నరసరావుపేటలో లాటరీ ప్రక్రియ జరుగుతుందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియలో సిండికేట్ల ప్రభావానికి తావు లేదన్నారు. గతంలో మద్యం వ్యాపారం చేసిన వారు కేవలం వారి స్వార్థం కోసమే లేనిపోని పుకార్లు పుట్టిస్తున్నారన్నారు. టెండర్ల విషయంలో టిడిపి ఎమ్మెల్యేల జోక్యం లేదన్నారు.

పల్నాడు జిల్లాలో మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు

గుర్తించిన ప్రాంతం	మొత్తం దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు	సగటున వచ్చినవి
నరసరావుపేట	17	285	17
చిలకలూరిపేట	17	189	11
సత్తెనపల్లి	15	289	19
క్రోసూరు	10	313	31
పిడుగురాళ్ల	12	320	27
గురజాల	15	240	16
మాచర్ల	10	117	12
వినుకొండ	14	338	24
ఈపూరు	9	238	26
పెదకూరపాడు	10	248	25
మొత్తం	129	2577	20

గుంటూరు జిల్లాలో మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు

నియోజక వర్గం	మొత్తం దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు	సగటున వచ్చినవి
గుంటూరు -1	17	649	38
గుంటూరు-2	16	611	38
ప్రత్తిపాడు	14	407	29
మంగళగిరి	24	970	40
తాడికొండ	19	876	46
తెనాలి	20	449	22
పొన్నూరు	17	459	27
మొత్తం	127	4421	34.81

అమెజాన్ ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : భాగస్వామి శ్రేయస్సు కోసం తన నిబద్ధతను బలోపేతం చేస్తూ, అమెజాన్ ఇండియా డయల్ 4242 సహకారంతో డెలివరీ భాగస్వామి కోసం అంబులెన్స్ సేవలను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి కె.ప్రభు కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డెలివరీ అసోసియేట్ల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తుందన్నారు. అమెజాన్ డెలివరీ సర్వీస్ పార్టనర్, వారి డెలివరీ అసోసియేట్‌లు, ఐ హావ్ స్పేస్, ఫ్లెక్స్ కార్యక్రమాల్లో 50 వేల మంది భాగస్వాములకు ప్రయోజనాన్ని చేకూర్చే ఆరు నెలల సమగ్ర ఆరోగ్య క్యాంపెయిన్‌ను రూపొందించింది అన్నారు.

రూ.పది కాయిన్ కష్టాలు



ప్రజాశక్తి - చిలకలూరిపేట

రూ.పది కాయిన్‌కు కష్టాలు వచ్చాయి. రూపాయి, రెండు, రూ.ఐదు నాణేలకు పెద్దగా సమస్యలు చెప్పని వ్యాపారస్తులు రూ.పది కాయిన్ తీసుకోవడానికి విముకత చూపుతున్నారు. రూ.పది కాయిన్ బరువు కారణంగా ఎక్కువ మొత్తంలో ఒకచోటు నుండి మరోచోటుకి తీసుకెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దీని కారణంగా ప్రజల నుండి రూ.పది కాయిన్‌కి తీరస్కరణకు గురవుతోంది. టీ కొట్టువాళ్లు, వ్యాపారస్తులు నాణ్యాలను తీసుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. నోటు ఉంటే ఇవ్వండి కాయిన్ వద్దు అని ముఖం మీదే చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. బరువు, ఒక చోట నుంచి మరో చోటకి తీసుకెళ్లడం, మార్చటం లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నామని వ్యాపారస్తులు చెబుతున్నారు. 10 కాయిన్ తీసుకునేందుకు వ్యాపారులు, టీకొట్ల వారు సుముఖత చూపడం లేదు. ప్రధానంగా ఏదైనా కొనుగోలు చేసి ఈ రూ.పది కాయిన్ ఇస్తుంటే తీసుకోవటం లేదు. నలిగిపోయిన, చిరిగిపోయో స్థితిలో ఉన్న రూ.పది నోటును వెంటనే తీసుకుంటున్నారు. రూ.పది నోట్ల స్థానంలో ఐదేళ్ల కిందట రూ.10 నాణేలను ఆర్బీఐ అందుబాటులోకి తీసుకొచ్చింది. అందుకు ప్రత్యామ్నాయంగా రూ.10 నాణెం చలామని అవుతోందని చెబుతున్న కొంతమంది వ్యాపారులు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు.

2019లో ఆర్‌బిఐ ప్రవేశపెట్టిన రూ.10 నాణేన్ని స్టాండర్డ్ డిజైన్‌తో మూడు రకాలుగా విడుదల చేశారు. రూ.10 నోటు మన్నిక లేకపోవడంతో సంవత్సరాల పాటు చలామణిలో ఉండేలా వాటి స్థానే నాణ్యాలను తీసుకొచ్చారు. కానీ వాటిని వాడడానికి ప్రజలు సుముఖత చూపడం లేదు. దేశ వ్యాప్తంగా వీటి వినియోగం ఎలా ఉన్నా రూ.10 నాణేన్ని ఇక్కడి ప్రజలు ఎందుకో తిరస్కరిస్తున్నారు. ఆర్‌బిఐ చట్టాల ప్రకారం ఎట్టి పరిస్థితిలో రూ.పది కాయిన్‌ను తప్పకుండా మారకంగా తీసుకోవాలి. అలా లేనిపక్షంలో కేసు నమోదు చేయించాలి. రూ.పది కాయిన్ అన్నిచోట్లా అమలులో ఉందని, అన్నిచోట్ల చెల్లుబాటు అవుతోందని ఇటీవల ఆర్‌బిఐ స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఆయా బ్యాంకులో ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. వాణిజ్య సముదాయాల్లో నాణ్యాన్ని తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని స్వయంగా ఆర్‌బిఐ పలుమార్లు వెల్లడించింది. అయితే పెట్రోల్ బంకులు, వ్యాపారస్తులు, చిరువ్యాపారులు అవగాహన లేక రూ.పది నాణేన్ని తిరస్కరిస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో సైతం తిరస్కరించడం విడ్డూరంగా ఉందని, వారికి అవగాహన కల్పించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఒక వ్యాపారస్తుల మాటల్లో..

'రూ.పది నాణేన్ని తీసుకొక పోవటానికి ప్రధానంగా దాని బరువు కారణం. సుమారు 10 గ్రాముల వరకు బరువు ఉంటుంది. అదే నోటు బరువు తక్కువగా ఉంటుంది. కాబట్టి నోటును లెక్క వేయటానికి, తీసుకెళ్లటానికి సులువుగా ఉంటుంది. అందుకే నోటుకే ప్రాముఖ్యత ఇస్తున్నాం.'

టీ దుకాణాల వారేమంటున్నారు..

మావి చిన్న గల్లా పెట్టెలు. వ్యాపార హడావిడిలో చిల్లర ఇచ్చే క్రమంలో ఎక్కువ ఇబ్బందులు పడుతాం. కాబట్టి కాయిన్స్ కంటే నోటును తీసుకుంటాం.

త్వరలో అమరావతికి స్పోర్ట్స్ సిటీ

ఎసిఎ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గత ప్రభత్వం క్రీడాకారుల భవిష్యత్తు గురించి ఏ మాత్రం ఆలోచించలేదు. రాష్ట్రంలోని స్టేడియాలను నిరుపయోగంగా మార్చేసింది. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో 175 నియోజకవర్గాల్లో శాప్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మారుమూల పల్లెలో వున్న నైపుణ్యం గల క్రీడాకారులను వెలికి తీసేందుకు క్రికెట్, బ్యాడ్మింటాన్, వాలీబాల్, కబాడీ లాంటి అన్ని క్రీడలకి సంబంధించి టోర్నమెంట్స్ నిర్వహించబోతున్నామని విజయవాడ ఎసిఏ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ టోర్నమెంట్స్ డిసెంబర్ 1వ తేదీ నుంచి జనవరి 15 వ తేదీ వరకు జరుగుతాయన్నారు. విజయవాడలో చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో యోనెక్స్ సన్ రైజ్ నాగబాబు మెమోరియల్ నిర్వహించిన ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ -2024 విజేతలకు బహుమతి ప్రదానం చేసేందుకు ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా శాప్ చైర్మన్ రవినాయుడుతో కలిసి పాల్గొన్నారు. అండర్ -17 బాయ్స్ డబుల్ ఫైనల్స్ ఆడే క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం మ్యాచ్ ఆసక్తి తిలకించారు. ఈ మ్యాచ్‌లో గెలిచిన బాల ప్రణయ్ ప్రగడ, ప్రణీత్ సోమానికి విన్నర్ కప్ అందించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడలో ఒకవైపు దసరా మహోత్సవాలు మరోవైపు ఈ బ్యాడ్మింటన్ సంబరాలు జరగటం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున కృషి జరుగుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో హైదరాబాద్‌లో తొమ్మిది స్టేడియాలు నిర్మించి క్రీడాభివృద్ధి చేశారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం క్రీడాంధ్ర ప్రదేశ్‌గా మారనుందన్నారు. 2027లో రాష్ట్రానికి నేషనల్ గేమ్స్ రానున్నాయన్నారు. త్వరలో అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతుందని తెలిపారు. ఇక ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ తరుపున అన్ని క్రీడాలను ప్రొత్సహించాలనే ఉద్దేశ్యంతో వున్నామని స్పష్టం చేశారు. ఇండియా క్రికెట్ టీమ్‌లో బాగా రాణించిన నితీష్ రెడ్డిని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో టాలెంట్‌తో ఉన్న క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు విజయవాడ, విజయనగరం, అనంతపురం ప్రాంతాల్లో మెన్స్‌కి, గుంటూరులో లేడీస్ క్రికెట్ అకాడమిలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరి క్రికెట్ స్టేడియంలో అన్ని క్రీడలకు సంబంధించి త్వరలో స్పోర్ట్స్ సెంటర్ నిర్మించబోతున్నట్లు ఎసిఎ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ అంకం చౌదరి, శాప్ బ్యాడ్మింటన్ కోచ్ కె.భాస్కర్, టిడిపి నాయకులు మాదిగాని గురునాథం, నరసింహ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోసం లోకేష్‌కు వినతులు



వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేష్

ప్రజాశక్తి-తాడేపల్లి

మంత్రి నారా లోకేష్ ఉండవల్లిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు మంగళగిరి నియోజకవర్గ నుండే కాక రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి అనేకమంది వినతులు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం అందజేయాలని ఉండవల్లికి చెందిన కె.మంగ విజ్ఞప్తి చేయగా ఇంజినీరింగ్ చదివినా ఉద్యోగం రాలేదని, వివాహమై ఇద్దరు పిల్లలున్న తనకు కుటుంబ పోషణ భారమైందని, విజయ డైరీలో తనకు ఉద్యోగం ఇప్పించాలని మంగళగిరికి చెందిన కె.రాణి అర్జీనిచ్చారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్తకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని తాడేపల్లి సుందరయ్య నగర్‌కు చెందిన నాగేశ్వరమ్మ కోరారు. మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో హౌస్ కీపింగ్ ఉద్యోగం ఇప్పించాలని మంగళగిరి రూరల్ మండలం నవులూరుకు చెందిన ఎ.వెంకటరమణ విన్నవించారు. స్థానికులతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారు ఇచ్చిన అర్జీల్లో ఎక్కువగా ఆర్థికపరమైనవే ఉన్నాయి. అర్జీలు స్వీకరించిన మంత్రి లోకేష్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఉరుసు మహోత్సవానికి ఆహ్వానం

తాడికొండ మండలం నిడుముక్కలలో హజరత్ పీరానేపీర్ దస్తగీర్ మహబూబ్ సుభాని అవులియా, 72వ ఉరుసు మహోత్సవానికి రావాల్సిందిగా మంత్రి నారా లోకేష్ ఆహ్వాన పత్రికను హజరత్ షేక్ షబ్బీర్ బాష తాజ్ వుల్ ఖద్రీ, 101 దర్గా ముజ్ వర్‌ము అందజేశారు. 101 దర్గాలున్న నిడుముక్కలలో ఈనెల 14న గుసూల్, చందనం పూయుట, 15న గంధం, రాత్రి 8 గంటలకు అన్న సంతర్పణ, 16న దీపారాధన ఉంటుందని మంత్రికి వివరించారు.

బాలలు పనుల్లో కాదు బడుల్లో ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

లేబర్ డ్రైవ్' కార్యక్రమం పేరుతో జిల్లాలోని వివిధ వ్యాపార సంస్థలు, దుకాణాల్లో తనిఖీలు చేశామన్నారు. మెకానిక్ షాపులు, హోటల్స్, బేకరీ షాపులు, సూపర్ బజారు, ఇతర షాపుల్లో పనిచేయుచున్న బాల కార్మికులను గుర్తించామని, 18 ఏళ్లలోపు బాల కార్మికులను షాపులలో పనిచేయించుకోవటం చట్టరీత్యా నేరమని అన్నారు. బాలల హక్కులకు భంగం కలిగించకుండా వారిని చదువు బాట పట్టే విధంగా తల్లిదండ్రులు వ్యవహరించాలని కోరారు. అనంతరం వారి వారి తల్లిదండ్రులను పిలిపించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పుడు పిల్లలు చదువుకొనుటకు అనేక సౌకర్యాలు ఉన్నాయని, మంచి సమాజం ఉండాలంటే ఆరోగ్యకరమైన పౌరులు ప్రజలు ఉండాలని అన్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలని కోరుతూ వారి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫ్ కింగ్ సిఐ నరసింహారావు, మహిళా ఎఎస్ఐ బేబీ రాణి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్, జిల్లా న్యాయ సేవా సదన్, పారా లీగల్ వాలంటరీలు, బచ్పన్ బచావో ఆందోళన్ స్టేట్ కో-ఆర్డినేటర్ తిరుపతిరావు, సిఆర్ఎఎఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ సమీర్ కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ సరిత, నవీన్, విద్యాశాఖ, ఎన్జీవో డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సహకారంతో జరుగుతున్న మంగళగిరి కబడ్డీ లీగ్ పోటీలు మూడవ రోజు శుక్రవారం ఉత్కంఠ భరితంగా కొనసాగాయి. మంగళగిరి బీఎండబ్ల్యూ షోరూమ్ పక్కన గల మైదానంలో శుక్రవారం ఉదయం నుంచి లీగ్, నాకౌట్ పద్ధతిలో 5 జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. మూడవ రోజు జరిగిన పోటీలలో పురుషుల విభాగంలో ప్రకాశంపై తూర్పుగోదావరి జట్టు 22-58 స్కోర్‌తో విజయం సాధించింది. అనంతపురంపై గుంటూరు 18-57 స్కోర్‌తో గెలుపొందింది. మహిళ విభాగంలో గుంటూరుపై విజయనగరం 23-49 స్కోర్‌తో విజయం సాధించింది. ప్రకాశంపై చిత్తూరు 17-42 స్కోర్‌తో విజయం సాధించగా, విశాఖపట్నంపై శ్రీకాకుళం 19- 24 స్కోర్‌తో గెలుపొందింది. శనివారం సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు జరగనున్నాయి. అనంతరం గెలుపొందిన విజేతలకు వేరువేరుగా బహుమతులు అందజేస్తారు. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో కబడ్డీ పోటీలకు ఈవెంట్ స్పాన్సర్‌గా మురళీకష్ణ యార్లగడ్డ (మార్కోరోస్) వ్యవహరిస్తున్నారు.



కబడ్డీ పోటీల్లో తలబడుతున్న టీమ్‌లు

జిహెచ్‌ఎంసి ప్రాజెక్టులను పరిశీలించిన జిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గ్రేటర్ హైదరాబాదు మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని దుర్గంచెరువు సివేజ్ ట్రీట్మెంట్‌ప్లాంట్, హైదరాబాదు మెట్రో వాటర్ ప్రాజెక్ట్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను గుంటూరు నగర కమిషనర్ పులిశ్రీనివాసులు బందం శుక్రువారం పరిశీలిచారు. ఒడిశా, తెలంగాణా రాష్ట్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లలో అమలు చేస్తున్న కార్యక్రమాల అధ్యయన యాత్రలో భాగంగా శుక్రవారం జిహెచ్‌ఎంసిలో వివిధ ప్రాజెక్ట్‌లను నగర కమిషనర్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కమిషనర్ బృందానికి తొలుత దుర్గం చెరువులోని ఎస్‌టిపి ప్లాంట్ వివరాలను స్థానిక అధికారులు వివరించారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ డిజాస్టర్ రెస్పాన్స్‌ఫోర్స్ కార్యాలయాన్ని పరిశీలించారు. సదరు ప్రాంతంలోని గార్బేజ్ ట్రాన్సుర్ స్టేషన్లను, పని తీరుని పూర్తిస్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తొలుత దుర్గం చెరువు ఎస్టిపిని పరిశిలించి ఎస్టిపి సామర్థ్యం వాటర్ ట్రీట్మెంట్‌ప్లాంట్ విధానాన్ని వివరంగా అడిగి తెలుసుకొని, వాటర్ శాంపిల్స్‌ని పరిశీలించారు. గార్బేజ్ ట్రాన్సుర్ స్టేషన్లను పరిశిలించి ప్రతిరోజు చెత్తని ఏ విధంగా తీసుకొచ్చే తీరుని వాటి నిర్వహణను పరిశీలించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు కార్యాలయంలోని విభాగాలను, పనిచేసే సిబ్బంది ఏవిధమైన సమస్యలకు ఎలా స్పందిస్తున్నారో పూర్తి వివరాలు తెలుసుకున్నారు.




వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిశీలిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

ప్రాజెక్ట్‌ల పరిశీలనలో భాగంగా హైదరాబాద్ మెట్రో వాటర్ ప్రాజెక్ట్‌ని పరిశిలించి తాగునీటి సరఫరా, తాగునీటి శుద్ధి పైప్‌లైన్లను పరిశీలించారు.

డాక్టర్ శరణ్ దంత వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, శ్రీనివాసరావుపేట ఏడవ లైన్‌లో ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ డి.జయశరణ్‌రెడ్డి ఎండీఎస్ స్థాపించిన డాక్టర్ శరణ్ దంత వైద్యశాలను శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండీఎస్ చదివి, రూట్ కెనాల్ చికిత్సలో అనుభవం గల డాక్టర్ జయశరణ్‌రెడ్డి ఆధునిక వైద్య పరికరాలతో నూతనంగా వైద్యశాలను సామాన్య ప్రజలు, పేద వర్గాలు అధికంగా నివశిస్తున్న శ్రీనివాసరావు పేటలో ప్రారంభించటం అభినందనీయం అన్నారు. నేటి ఆధునిక సమాజంలో దంతాలను పరిరక్షించుకోవడం అవసరం అన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ ఇటీవల కాలంలో దంత వైద్యులు గణనీయంగా పెరుగుతున్నారని తెలిపారు. దంతాల పరిరక్షణలో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రావటం, ఆధునిక చికిత్స విధానాలతో సులభంగా, త్వరగా దంతాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకో గలుగుతున్నారన్నారు. డాక్టర్ శరణ్ దంతవైద్యశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రముఖ వైద్యులు డాక్టర్ బూసిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ యర్ర నాగేశ్వరరావు, మానవత చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి పి. సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శరణ్ ప్రసంగిస్తూ సామాన్యులు, పేదలకు అందుబాటులో దంత వైద్యశాలను నిర్వహిస్తామని ఆధునిక వైద్య చికిత్సలు, వైద్య పరికరాలతో దంతాల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.



వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

బ్లడ్ బ్యాంక్‌తో ప్రజలకు మేలు

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బ్లడ్ బ్యాంక్‌తో జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగు తుందని, బ్లడ్ బ్యాంక్ అభివృద్ధికి, వారు నిర్వహించే కార్యక్రమాలకు తనవంతు చేయూతను ఇస్తానని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ 200 పడకల సామర్థ్యం ఉన్న వైద్యశాలలో బ్లడ్ బ్యాంక్ విశేషమైన సేవలను అందిస్తుందన్నారు. 1000 ప్యాకెట్ల బ్లడ్ నిల్వలతో పాటు ప్లేట్లెట్స్,ప్లాస్మా వంటి వాటిని సేకరించే అవకాశం ఉండటంతో డెంగ్యూ, హిమోఫిలియా, తలసేమియా, రోడ్డు ప్రమా దాలు జరిగిన సమయంలో రక్తం అవసరం ఎంతో ఉంటుందని, ఈసమయంలో బ్లడ్‌బ్యాంక్‌ల వల్ల ఎంతో మేలు జరుగు తుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు కపలవాయి విజయ్ కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్, రెడ్ క్రాస్ ప్రతినిధులు డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి,డాక్టర్ ఎల్. సజన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

14 నుండి ఎస్‌జిఎఫ్ జిల్లా టోర్నమెంట్లు

ప్రజాశక్తి-గుంటూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి టోర్నమెంట్లు ఈనెల 14 నుండి 22వ తేదీ వరకూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి యం.రవి ఒక ప్రకటనలో తెలిపారు. 14న స్కేటింగ్ గుంటూరు బిఆర్ స్టేడియంలో, 15వ తేదీన వాలీబాల్ వేజెండ్ల జెడ్పీ హైస్కూల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్ గుంటూరు బి.ఆర్ స్టేడియం, 16న ఫుట్‌బాల్ నందిగామ జెడ్పీ హైస్కూల్, బాల్ బ్యాడ్మింటన్ శ్యావల్యాపురం జెడ్పీ హైస్కూల్, 18న చెస్ గుంటూరు చౌత్రా సెంటర్‌లోని గరల్స్ హైస్కూల్‌లో, కబడ్డీ అండర్-17 చినకాకాని జెడ్పీ హైస్కూల్, 19న హ్యాండ్‌బాల్ నారాకోడూరు జెడ్పీ హైస్కూల్, హాకీ చెరువు జమ్ములపాలెం జెడ్పీ హైస్కూల్, బాల్ బాడ్మింటన్ పసుమర్రు జెడ్పీ హైస్కూల్, సాఫ్ట్‌బాల్ రొంపిచర్ల జెడ్పీ హైస్కూల్, 21న కబడ్డీ అండర్ 14 పివి పాలెం జెడ్పీహైస్కూల్, 22న టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, ఆర్చరీ బిఆర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం వర్షాల నేపథ్యంలో అధికారులతో సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పూడిక తీసిన ప్రాంతాల్లోని ఓపెన్ అవుట్‌ఫాల్ డ్రైన్ వద్ద ప్రమా ద సూచికలు సూచిస్తూ ఎరుపు రంగు జెండాలు ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో, రోడ్లమీద నిలిచిన నీటిని వెంటనే బెయిల్‌అవుట్ చేసేలా సచివాలయ కార్యదర్శులు, స్థానిక అధికారులు సమన్వయంతో కృషి చేయాలని స్పష్టం చేశారు. సెట్ కాన్ఫరెన్స్‌లో సిఎంఓహెచ్, ఎంహెచ్‌ఒలు, ఈఈలు, ప్రజారోగ్యాధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



సీతానగరంలో అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని సీతానగరం నుండి గోరా కాలనీకి వెళ్లే రోడ్లో అక్రమ నిర్మాణం జోరుగా సాగుతుంది. దీనికి స్థానికంగా ఉన్న ఓ రాజకీయ పార్టీ చోటా నాయకుడు భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ రోడ్డుతో పాటు డ్రైనేజీ ని కూడా ఆక్రమించి నిర్మాణాలు యధేశ్చగా కొనసాగుతుంది. వీటిని అరికట్టవలసిన మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

గల్లంతైన యువకుని మృత దేహం లభ్యం

ప్రజాశక్తి - అమరావతి

స్నానం చేసేందుకు కృష్ణానదిలో దిగిన వ్యక్తి నదీప్రవాహానికి కొట్టుకుని పోయి రెండు రోజుల క్రితం గల్లంతయ్యాడు. పోలీసుల గాలింపులో శుక్రవారం మృతదేహమై లభించారు. అమరావతి సిఐ ఎం శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మల్లాది గ్రామస్తుడు మేరీ బాబు కుమారుడు సన్నీ (18) స్నానం చేసేందుకు బుధవారం కృష్ణానదిలో దిగాడు. ఈక్రమంలో ప్రవాహం తీవ్రంగా ఉండటంతో కొట్టుకుని పోయాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ధరణికోట వద్ద కృష్ణానదిలో మృతదేహన్ని గమనించిన మత్స్యకారుడు పోలీసులకు తెలపడంతో సన్నీ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి అనంతరం అమరావతి ప్రభుత్వాసుపత్రికి శవ పంచనామా నిమిత్తం తరలించారు. ప్రమాద సంఘటనగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ ఎం శ్రీనివాసరావు తెలిపారు.



రూ.15 కోట్లతో వినుకొండ ఆర్టీసీ డిపోను అధునాతనంగా తీర్చిదిద్దుతాం

కొత్త బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - వినుకొండ

ఆర్‌టిసి డిపోకు కొత్తగా కేటాయించిన 2 ఇంద్ర ఏసీ బస్సులు, 4 ఎక్స్‌ప్రెస్‌లను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. వినుకొండ డిపోను రూ.15 కోట్లతో ఆధునాతనంగా విస్తరిస్తామని చెప్పారు. వినుకొండలో స్టేడియం ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వినతిపత్రం ఇచ్చారు. అధికారులు, యూనియన్ల నాయకులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు డిఎం. శ్రీనివాసరావు, ఇడి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.



పోటీల్లో ప్రతిభ చాటిన బాలికలకు చెక్కులు అందజేస్తున్న డిఆర్‌ఒ కె.వినాయకం

బాలికలు విద్యావంతులుగా ఎదగాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాలికలకు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ బాలికలు విద్యావంతులుగా ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. బాలికలు వివిధ అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇన్‌ఛార్జి పీడీ ఉమామహేశ్వరి వివరించారు. వివక్ష కారణంగా అమ్మాయిలు హింసకు గురవుతున్నారని, ఈ ధోరణి మారాలని, చైతన్యం ద్వారానే ఇది సాధ్యమని చెప్పారు. అసిస్ట్ సంస్థ ప్రతినిధి దుర్గారాణి, గుడ్ షెఫర్డ్ డైరెక్టర్ సిస్టర్ వెనరసి మాట్లాడుతూ విద్యతో పాటుగా కాలానుగుణమైన నైపుణ్యాలను అందిపుచ్చుకొని భవిష్యత్తును తీర్చి తీర్చిదిద్దుకోవాలన్నారు. బాల్య వివాహాలతో ఆడ పిల్లల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, వీటిని నివారించడం అందరి బాధ్యతని చెప్పారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన బాలికలకు రూ.10 వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, వెల్ బేబీ షో నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి, జిసిడిఒ రేవతి, సిడిపిఒలు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

జన్మభూమి నాలుగు గంటల ఆలస్యం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : విశాఖపట్నం నుండి లింగంపల్లి వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు నాలుగు గంటలు ఆలస్యంగా నడిచింది. మధ్యాహ్నం 2 గంటలకు సత్తెనపల్లి రావాల్సిన రైలు సాయంత్రం ఆరుగంటలకు వచ్చింది. దసరా సందర్భంగా వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు స్టేషన్‌లో పిల్లా పాపలతో అవస్థ పడ్డారు. విజయవాడ డివిజన్‌లో పనులు కారణంగా రైలు ఆలస్యమైనట్లు రైల్వే అధికారులు తెలిపారు.



రైతులకు భారంగా ఎరువుల ధరలు



ప్రజాశక్తి - చిలకలూరిపేట

రసాయనాల ఎరువుల వాడకం వల్ల భూమి గుల్లభారీ పంటల దిగుబడి తగ్గుతుందని, సాధారణ ఎంపికె ఎరువులను మాత్రమే వాడాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మొక్క దృఢంగా పెరగాలంటే నత్రజని (యూరియా ఎరువులు) ఎరువులు వాడాలని, వేరు వ్యవస్థ బలంగా భూమిలోనికి చొచ్చుకుపోయి పూర్తిస్థాయిలో బలాన్ని సేకరించాలంటే భాస్వరాన్ని (డిఎపి) వాడాలని, గింజ ఏర్పడి బలముగా నాణ్యతగా రావాలంటే పోటాష్ (ఎంఒపి) వాడాలని చెబుతుంటన్నారు. అయితే వీటి ధరలు రైతులకు నానాటికీ భారమవుతున్నాయి.

ప్రస్తుతం యూరియా 45 కిలోల బస్తా రూ.265, డిఎపి 50 కిలోల బస్తా రూ.1350 ఎంఒపి 50 కిలోల బస్తా రూ.1700 ఉంది. మిగతా ఎరువులైన 20:20:0:13, రూ.1120, సూపర్ రూ.900గా, 10:26:0 రూ.1476గా, 28:28:0 రూ.1,650గా, 14:35:14 రూ.1650, సూపర్ ప్రాస్పరస్ రూ.1500, అమోనియం సల్ఫేట్ రూ.వెయ్యి, సూపర్ పొటాస్ రూ.600కు అమ్ముతున్నారు. ఈ ధరలన్నీ సబ్సిడీ మినహాయించే. 50 కిలోల ఎరువుల బస్తా రూ.2040.70 కాగా ఇందులో రూ.690.70 సబ్సిడీ పోను మార్కెట్‌లో రూ.1350కు అమ్ముతున్నారు. పురుగు మందులు గతం కంటే ధరలు 10-15 శాతం పెరిగాయి. మరోవైపు తరచూ వానల నేపథ్యంలో పైర్లకు తెగుళ్లు సైతం ఎక్కువగా సోకుతున్నాయి. ఈ నేపథ్యంలో పైర్లను రక్షించుకోవడానికి రైతులు అధికంగా ఎరువులు, మందులు వాడాల్సి వస్తోంది.

గతంలో పైరుకు బలం కోసం మిర్చికి 15 బస్తాలకుపైగా, పత్తికి 8 బస్తాలుపైగా ఎరువు వేసేవారు. ఈ ఏడాది అధిక వర్షాలకు పైర్లు దెబ్బతిని మిర్చికి 25 బస్తాల వరకు, పత్తికి 10 బస్తాలకుపైగా ఎకరానికి వేయాల్సి వస్తోంది. దీంతోపాటు పచ్చదోమ, తెల్లదోమ ఉధృతి పెరిగింది. గతంలో ఒకసారి మందులు పిచికారీ చేస్తే సరిపోయేది ఇప్పుడు మూడుసార్లు వేసినా నియంత్రణలోకి రావడం లేదు. దీంతో తడవకు రూ.2 వేల చొప్పున రైతులు అదనంగా భరించాల్సి వస్తోంది. ఇందుకుగాను డబ్బుల కోసం సతమతమవుతున్నారు. తమ ఇబ్బందులను గమనించి 50 శాతం సబ్సిడీతో ఎరువులు, పురుగు మందులను రైతుసేవా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.



రాయితీపై నూనె విక్రయ కేంద్రాలు ప్రారంభం



విక్రయ కేంద్రంలో నూనె ప్యాకెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాయితీ వంట నూనెల విక్రయ కేంద్రాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణం మల్లమ్మ సెంటర్‌లో విజయ గణపతి ఆయిల్ మర్చంట్స్, శివుని బొమ్మ సెంటర్‌లోని మహాలక్ష్మి రోటరీ ఆయిల్స్‌లో వంట నూనెల ప్రత్యేక రాయితీ విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. పామాయిల్ ప్యాకెట్ రూ.110, సన్ ఫ్లవర్ ఆయిల్ పాకెట్ రూ.124కు విక్రయిస్తారని చెప్పారు. ప్రత్యేక కౌంటర్ వద్ద తెల్ల రేషన్ కార్డు వున్నవారికి 3 పాకెట్లు పామాయిల్, ఒక పాకెట్ సన్ ఫ్లవర్ ఆయిల్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి డిఎస్‌ఒ నారదముని, సివిల్ సప్లయీస్ డిటి కొండారెడ్డి, ఆయిల్ మిల్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బ్రిడ్జీలు, ఫ్లైవోవర్ నిర్మించండి..

రోడ్లు, భవనాల శాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యే అరవిందబాబు శుక్రవారం కలిశారు. పల్నాడు జిల్లాతో పాటు డివిజన్ కేంద్రమైన నరసరావుపేట నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలను చర్చించారు. పలు మార్గాల్లో చప్టాలున్నాయని, భారీ వర్షాలు, వాగులు పొంగే సమయాల్లో ఇవి ప్రమాదకరంగా ఉంటున్నాయని చెప్పారు. చప్టాలను హైలెవల్ బ్రిడ్జీలుగా మార్చేందుకు నిధులు కేటాయించాలని కోరారు. నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలోనూ పలు వార్డులు, ప్రధాన రహదారుల్లో సైతం బ్రిడ్జీల నిర్మాణం చాలా ఉందని చెప్పారు. రహదారుల అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. జిల్లా కేంద్రం కావడంతో రాష్ట్రస్థాయి అధికారులు, మంత్రులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్ల విస్తరణ అవసరమైందన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కారానికి ఫ్లై ఓవర్ ఏర్పాటు అత్యవసరమన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కపలవాయి విజయ్ కుమార్, కొల్లి వెంకటేశ్వర్లు, గాడిపర్తి సురేష్ ఉన్నారు.

గింజుపల్లి రీచ్ మార్గంలో గాడి

ప్రజాశక్తి - అచ్చంపేట

మండల పరిధిలోని గింజుపల్లి ఇసుక రీచ్ వెళ్లేదారిలో అధికారులు పొక్లెయినర్లతో శుక్రవారం గాడి కొట్టించారు. మండలంలో వారం రోజులుగా ఇసుక అక్రమ రవాణా నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దారు జి.శ్రీనివాస్ యాదవ్ ఈ పనులు చేయించారు.



విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు నడపాలి : సిపిఎం



ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు రాకపోకలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ ఊటుకూరు గ్రామ మహాసభ జి.సురేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ బయ్యవరం, ఊటుకూరు, విప్పర్ల, తదితర గ్రామాల నుండి విద్యార్థులు క్రోసూరు మోడల్ స్కూల్‌కు వస్తుంటారని, గుంటూరు, పిడుగురాళ్ల నుండి క్రోసూరు వస్తున్న బస్సులు మోడల్ స్కూల్ వద్దకు నేరుగా వెళ్లకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామంలోని సిపిడబ్ల్యుఎస్ వాటర్ స్కీమ్ నుండి ఇంటింటికీ నీటి కుళాయి ఏర్పాటు చేయాలని, ఈ క్రమంలో సిమెంట్ రోడ్లు దెబ్బతినకుండా చూడాలని కోరారు. అధ్వానంగా ఉన్న పొలాల డొంకరోడ్లకు, ఎద్దు వాగుపై ఉన్న ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించాలన్నారు. ఈ మేరకు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఈ సందర్భంగా శాఖ నూతన కార్యదర్శిగా గంజిమాల మధుసూదనరావు, సహాయ కార్యదర్శిగా గర్నెపూడి మహేష్‌ను ఎన్నుకున్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.మల్లీశ్వరి, మండల కార్యదర్శి టి.హనుమంతరావు, నాయకులు ఎస్.మోహనరావు, జి.నాగరాజు, జి.ఎలిశమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

సిపిఎం నూజెండ్ల మండల శాఖ మహాసభ సీతారామయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగింది. తొలుత సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని, అసైన్డ్ భూములకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని, సాగర్ ఆయకట్టులోని పిబిసి కాల్వలకు నీరు విడుదల చేయాలని కోరుతూ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అనంతరం మండల నూతన కార్యదర్శిగా పి.ఆశీర్వాదంను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, నాయకులు కె.హనుమంతరెడ్డి, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.



ఇసుక నూతన విధానం అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎన్నికల వాగ్దానంలో కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా నూతన ఇసుక విధానాన్ని అమలు చేయా లని, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. గురువారం రాత్రి ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి లో సిపిఎం కుంచనపల్లి ఒకటవ శాఖ మహాసభ అమ్మిశెట్టి రామారావు అధ్యక్షతన జరిగింది. స్థానికంగా ఉన్న రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సమస్యలను పరిష్కారం చేయాలని, కుంచనపల్లిలో భూగర్భ జలాలు కలుషితమై, తాగునీరుకు ఇబ్బందులు పడుతున్న మంచినీటి సమస్యను, గ్రామంలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ కాలువలను నిర్మాణం చేపట్టాలని, తదితర సమస్యలను శాఖ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతు కూటమి ప్రభుత్వం ఏర్పడి, నాలుగు నెలలు కావస్తున్న ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేవడంలో విఫలమయ్యారని విమర్శించారు. తాడేపల్లి పరిసర ప్రాంతాల గ్రామాలలో సుమారు రెండు వేలకు పైనే భవన నిర్మాణ కార్మికులకు సరైన ఉపాధులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా ఇసుకను వినియోగదారులకు అందుబాటులోకి లేకుండా స్థానిక నాయకులే ఇసుకను మింగేస్తున్నారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించే విధంగా ఇసుకను అందుబాటులోకి తేవాలని అన్నారు. గత ఆగస్టు నెలలో కురిసిన అధిక వర్షాలకు తాడేపల్లి మండలంలోని అనేక గ్రామాలలో పంటలు నీట మునిగి, వాణిజ్య పంటలైన పసుపు, అరటి, కంద, ఆకుకూరలు వంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కౌలు రైతులు 50 వేల నుండి లక్ష రూపాయల వరకు, పెట్టుబడులు పేట్టి, తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని, కౌలు రైతుల అకౌంట్లోకి నేరుగా జమ చేయాలని, సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. అనంతరం సిపిఎం కుంచనపల్లి ఒకటవ శాఖా కార్యదర్శిగా అమ్మిశెట్టి రంగారావును సిపిఎం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభ లో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, సిపిఎం సీనియర్ నాయకులు అమ్మిశెట్టి సాంబయ్య, సిపిఎం నాయకులు కాజా వెంకటేశ్వరరావు, నల్లపు కిషోర్ బాబు, అమ్మిశెట్టి సుధాకర్, కొండపల్లి యశోద పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

పారిశుధ్య కార్మికులకు రూ.21 వేల వేతన జీవో అమలు చేయాలి


పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న కె ధనలక్ష్మీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి మండల విలీన గ్రామాలలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు , మార్చి 1వ తేదీ ఇచ్చిన జీవో ప్రకారం రూ.21000 వేతనం ఇవ్వాలని, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కే ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న, కేబి భవన్‌లో పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశం సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు చొక్కా మరియదాసు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ధనలక్ష్మి మాట్లాడుతూ తాడేపల్లి మండలం రూరల్ 8 గ్రామాలలో పనిచేసే పారిశుధ్య కార్మికుల వేతనాలు ఇవ్వాలని ఆనాడు సంఘం నాయకులు కలిసిన క్రమంలో మార్చి 1వ తేదీ నుండి రూ.21 వేల వేతనం ఇస్తామని మున్సిపల్ అధికారులు చెప్పారని అన్నారు. కానీ సెప్టెంబర్ నెల నుండి మాత్రమే వేతనం ఇస్తున్నారని ఆమె అన్నారు. అదే విధంగా మార్చి నెల జీవో ప్రకారం మార్చి నుండి ఆగస్టు వరకు ఆరు నెలల హెల్త్ అలవెన్స్ ఒక్కో నెలకు రూ.6000, చొప్పున మున్సిపల్ కార్మికులకు ఆరు నెలలు పెండింగ్ బకాయి రావాల్సి ఉందని ఆమె అన్నారు. అదేవిధంగా వాటర్ వర్కర్స్ కి జీవో ప్రకారం రూ.21 వేలు ఇవ్వాల్సి ఉండగా, 15 వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ఎలక్ట్రీషియన్ వర్కర్స్ కి 18,500 రావాల్సి ఉండగా పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని ఆమె మండిపడ్డారు. అంతేకాకుండా చెత్త తీసుకువెళ్లే ట్రాక్టర్, ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నా కూడా రికార్డులలో నమోదు చేయకుండా మున్సిపల్ అధికారులు తాత్సారం చేస్తున్నారని, మున్సిపల్ వర్కర్స్ పట్ల అధికారులు నిర్లక్ష్య ధోరణి తగదన్నారు. గ్రామాలలో ఇప్పటికి 20 మంది కాంట్రాక్ట్ వర్కర్లుగానే ఉన్నారని జీతాలు రూ.7000 నుండి 12,000 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఆ జీతాలు కూడా నెల నెల అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె అన్నారు. వెంటనే కాంటాక్ట్ కార్మికులను ఆప్కాస్ చేర్పించి, నెలకు రూ.21 వేల వేతనం అందేలా మున్సిపల్ కార్మికులు చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. వారాంతపు సెలవు ఒకరోజు పూర్తిగా ఇవ్వకుండా, వారంలో రెండు పూటలు గా సెలవు ఇవ్వడం విడ్డూరంగా ఉందని ఆమె మండిపడ్డారు. వారంతపు సెలవు ఒకరోజు పూర్తిగా ఇవ్వాలని అన్నారు. పారిశుధ్యకార్మికులకు కనీస సౌకర్యాలైన కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, సేఫ్టీ గ్లౌజులు విధిగా ఇవ్వాలని అన్నారు. పనిచేసే క్రమంలో చీపుర్లు, పారలు, బండి రిపేర్లకు మున్సిపల్ అధికారులు ఇవ్వాలని, కార్మికులనే పనిముట్లను తెచ్చుకోమనడం సరికాదని ఆమె అన్నారు. వెంటనే మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు జీవో ప్రకారం రూ.21 వేలు వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, పారిశుధ్య కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మేకల డేవిడ్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నాయకులు నాగ పోగు విజయరాజు, కె క్రాంతి కుమార్, సరోజినీ, కార్మికులు మారయ్య, కృష్ణ తులసి, ప్రాతూరు మరియమ్మ, ఇసుకపల్లి నాగరాణి, ప్రసన్న, రవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎం రవి

కార్మికుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ యూనియన్ కమిటీ సమావేశం శుక్రవారం రాత్రి మంగళగిరి సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ అధ్యక్షురాలు వి.వేంగమ్మ అధ్యక్ష వహించారు. కార్పొరేషన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్ చెంగయ్య రాజధాని కమిటీ యూనియన్ కార్యదర్శి ఎం.రవిలు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు, యూనియన్ నాయకుల పోరాట ఫలితంగా నాన్ ఆప్కాస్ రూ.15వేలు జీతం, ఆప్కాస్ కార్మికులకు రూ.21వేలు జీతాలు సాధించామన్నారు. వీటితో పాటు నగర పంచాయతీ కార్మికులకు ఇఎస్ఐ, ఇపిఎఫ్‌లు, పండుగ సెలవులు, సిఎల్ సెలవులు, వారంతపు సెలవులు వర్తింపజేసుకున్నామన్నారు. కార్మికుల ఐక్యతతోనే సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ సమావేశంలో యూనియన్ పట్టణ అధ్యక్షులు పేరం పూర్ణచంద్రరావు, మంగళగిరి మండల అధ్యక్షులు పార్వతి పాల్గొన్నారు.



ప్రత్తిపాడు ఎక్సైజ్ పరిధిలో

350 దరఖాస్తులు - రూ.7 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మద్యం షాపులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఎస్ రవీంద్రబాబు మాట్లాడుతు గుంటూరు విజ్ఞాన మందిరంలో టెండర్లను లాటరీ తీస్తారని తెలిపారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ శాఖ పరిధిలో మొత్తం 13 షాపులకు 141,వట్టిచెరుకూరు మండలాలని చెందిన 3షాపులకు 75, చేబ్రోలు మండలం 6షాపులకు 134 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్‌లో మొత్తం 350 మంది టెండర్లు నమోదు చేసుకున్నారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ పరిధిలో రూ.7కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది.

యువతకు దిశా నిర్దేశం చేస్తున్న నాటికలు

ఐదో రోజుకు చేరిన వీణ అవార్డ్స్ జాతీయ స్థాయి నాటకోత్సవాలు - నేడు ముగింపు

ప్రజాశక్తి-తెనాలి

:సమాజ శ్రేయస్సును యువతకు దిశానిర్దేశం చేసేలా నాటిక పోటీలు కొనసాగుతున్నాయి. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కళల కాణాచి, వేదగంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7న ప్రారంభమైన వీణ అవార్డ్స్ జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక, నాటిక పోటీలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. తొలి ప్రదర్శన వరంగల్ స్టార్ బ్రదర్స్ వారి చాంద్ సూరజ్ సమకాలీన పద్య నాటకం, తదుపరి ఇది అతని సంతకం సాంఘిక నాటకం, మతమా...మానత్వమా, నా శత్రువు సాంఘిక నాటకలు ప్రదర్శించారు. కార్యక్రమాన్ని బుర్రా సాయిమాధవ్, చెరుకుమల్లి సింగారావు, గోపరాజు విజయ్, వెంకట్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పర్యవేక్షించారు.


ఇది అతని సంతకం నాటకంలో సన్నివేశం

'ప్రతి మనిషికి జీవితంలో ఓ లక్ష్యం ఉంటుంది. దానికి నిర్దిష్టమైన ప్రణాళికా ఉంటుంది. దానిని అచరణలో పెట్టుకున్న వ్యక్తి ఖచ్చితంగా విజయం సాధిస్తాడు. అలాంటి వ్యక్తే కృష్ణమూర్తి. అబద్ధం లేని జీవితం ఆయన సొంతం. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పయనిస్తాడు. ప్రతి అడుగులోనూ ప్రత్యేకతను చాటుకుంటాడు. ముఖ్యంగా జీవిత చరమాంకంలో భార్యాభర్తలు ఎలా జీవించాలన్నది ముందుగానే చిత్రీకరించుకుని సార్థకం చేసుకుని దటీజ్ కృష్ణమూర్తి అనిపిస్తాడు. గుంటూరు అభినయ ఆర్ట్స్ ప్రదర్శనే 'ఇది అతని సంతకం'.

'పక్కపక్క ఇళ్ళలో నివసించే రామశర్మ, రెహమాన్ హిందూ, ముస్లింలు. కులం, మతం అనే పట్టింపు లేకుండా ఆ రెండు కుటుంబాలు ఎంతో అన్యోన్యంగా ఉంటాయి. రామశర్మ అర్చకత్వం వృత్తిగా జీవిస్తుంటాడు. ఆయన కొడుకు వెంకటశాస్త్రి కూడా అదే వృత్తిని స్వీకరిస్తాడు. ఒకరోజు గుడి తలుపులు తీయకపోవటంతో ఎందుకు తీయలేదని రామశర్మ కుమారుడిని ప్రశ్నిస్తాడు. తనకు వృత్తిపై నమ్మకం లేదని, ప్రస్తుతం క్రైస్తవాన్ని స్వీకరించానని తండ్రికి చెబుతాడు. కుటుంబం యావత్తూ బతిమిలాడిన వైఖరిని మార్చుకోకోపోగా తండ్రిపై కాలెత్తుతాడు. హఠాత్పరిణామానికి రామశర్మ చనిపోతాడు. అతని కర్మకాండలు నిర్వహించేదుకు కూడా నిరాకరించటంతో, తల్లి అతని జన్మరహస్యాన్ని వివరిస్తుంది. వెంటనే ప్రాయశ్చిత్తం పొందిన వెంకటశాస్త్రి మతం కాదు .. మానవత్మమే ముఖ్యమని చెప్పటమే శ్రీకాకుళం లలితశ్రీ కళా సమితి ప్రదర్శన 'మతమా..మానవత్వమా'...


మతమా..మానవత్వమా నాటికలో సన్నివేశం

'ప్రస్తుత కాలంలో టెక్నాలజి ఎంతగానో పెరిగిపోయింది. అంతర్జాలంలో అంతా కనువిందు చేస్తోంది. పెరిగిన సాంకేతికతను అవసరానికి తగినట్టుగా ఉపయోగించుకుంటే ఎంత ప్రయోజనమో, అవసరానికి మించి ఉపయోగిస్తే అంత ప్రాణాంతకమని వివరించే సందేశమే 'నా శత్రువు' నాటిక ఇతి వృత్తం. వీణా అవార్డ్స్ జాతీయ స్థాయి నాటకోత్సవాల్లో హైదరాబాద్ యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్స్ ప్రదర్శన నా శత్రువు నేటి యువతకు ఎంతో సందేశాత్మకంగా నిలిచింది.

యడ్లగోపాలరావుకు బుర్రా సుబ్రహ్మణ్యం శాస్త్రి పురస్కారం

ఈనెల 7 నుంచి ప్రారంభమైన వీణ అవార్డ్స్ జాతీయ స్థాయి నాటకోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ముగింపు సందర్భంగా బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రీజాతీయ రంగస్థల పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల పౌరాణిక నటులు యడ్ల గోపాలరావుకు అందించనున్నట్లు కళల కాణాచి సంస్థ అధ్యక్షులు బుర్రా సాయిమాధవ్ తెలిపారు.

రోగుల సహాయకులకు అద్దెకు గదులు : ఈవో నాగలక్ష్మి

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో వందలాది మంది నిత్యం వైద్యం పొందుతుంటారు. అయితే వారి బాగోగులు చూసుకోవడానికి సహాయంగా వచ్చే వారికి వసతి సౌకర్యం పెద్ద ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో రోగుల సహాయకుల కోసం రైలుపేట ఒకటో లైనులోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఇంకొల్లు మురహరి వారి ధర్మ సత్రంలో వసతి కల్పిస్తున్నామని సత్రం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఇఒ) నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. కనీస రుసుంతోనే గదులు అద్దెకిస్తామని, వసతి కావాల్సివారు ప్రభుత్వాస్పత్రిలో రోగికి ఇచ్చే కేస్‌షీట్, ఆధార్ కార్డును చూపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇన్ని రోజులనే నిబంధనేమీ లేదని, రోగులు పూర్తిగా కోలుకుని ఇంటికెళ్లే వరకూ వారి సహాయకులకు వసతిని కల్పిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సహాయకులకు అసౌకర్యమేమీ లేకుండా మౌలిక వసతులు కల్పించామని చెప్పారు.



'విశ్వకర్మ పథకం' సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మాచర్ల

చేతి వృత్తులు చేసే బడుగు, బలహీన వర్గాల వారికి విశ్వకర్మ పథకం ప్రయోజకరంగా ఉందని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాబు జగజ్జీవన్‌రామ్ చర్మకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆదిరాల ఆదాం కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ పథకంలో భాగంగా కుట్టుమిషన్ నేర్చుకునే వారికి ఇతర వృతుల వారికి శిక్షణతో పాటు రోజూవారి డబ్బులు ఇవ్వటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చేతివృత్తుల వారి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. స్థానిక సమస్యల పరిష్కారం పట్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చొరవ బాగుందని చెప్పారు. కార్యక్రమంలో చర్మకారుల సంఘం అధ్యక్షులు మాచర్ల కాశయ్య, బీర్నిడి కుమార్, అల్లి వెంకట్రావ్, డప్పు కళాకారుల సంఘం అధ్యక్షులు కుక్కమూడి నాగయ్య, అల్లి లాజర్, రాయంకుల ఏసయ్య, కంభంపాటి కాశి పాల్గొన్నారు.



సాయిబాబా ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయదశమి సందర్భంగా దసర ఉత్సవాలలో భాగంగా విజయపురిసౌత్ ప్రధాన రహదారిలోని సాయిబాబా దేవాలయంలో శుక్రవారం సీనియర్ జర్నలిస్ట్ ఎంఎస్ నాగేశ్వరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ముందుగా జర్నలిస్ట్ నాగేశ్వరావు కుటుంబ సభ్యులు సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అరుణా దేవి, శ్రీతేజసాయి, కార్తీక్, ఎం.సుబ్బలక్ష్మి, వెంకటరమణ, దేవస్థాన అధ్యక్షులు హరి, దేవాలయ అర్చకులు హనుమాన్ చారి, సీతారామ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

'చైతన్య కళా స్రవంతి' అప్పారావు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రముఖ రంగస్థల కళాకారుడు, సినీ, రచయిత, దర్శకులు, చైతన్య కళా స్రవంతి వ్యవస్థాక కార్యదర్శి రామరాజు వెంకట అప్పారావు(69) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. అనారోగ్య కారణంతో హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందారు. చైతన్య కళాస్రవంతి సంస్థను స్థాపించి ఎంతో మంది కళాకారులను సమాజానికి పరిచయం చేశారు. సాంఘిక పౌరాణిక నాటకాల్లో తనదైన శైలితో కళా అభిమానుల మనసును దోచుకున్నారు. నంది నాటకోత్సవాల్లో పాల్గొన్నారు. ఉషోదయ కళా పరిషత్ ఆధ్వర్యంలో వీదినాటిల్లో పాల్గొన్నారు. రిజిస్టర్ ఆఫీసులో డాక్యుమెంటరీ రైటర్ గా పనిచేస్తున్న అప్పారావు ప్రస్తుతం చైతన్య కళా స్రవంతి, ప్రజానాట్యమండలి తదితర కళాపరిషత్‌లకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నారు. ఈయనకు భార్య అంజనీ ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామరాజు అప్పారావు మృతి కళారంగానికి తీరని లోటని ఉషోదయ కళా పరిషత్ వ్యవస్థాపకులు పిన్నమనేని పాములయ్య అన్నారు. అప్పారావు మృతికి సంతాపం ప్రకటించారు. ప్రజానాట్యమండలీ కళాకారుడు సినీనటుడు వల్లెం చెన్నకేశవ నాయుడు, సంతాపం ప్రకటించారు. పలువురు కళాకారులు అప్పారావు మతికి సంతాపం తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో రోడ్లు గుంతలమయం



ప్రజాశక్తి - నాదెండ్ల

గత ప్రభుత్వ హయాంలో రోడ్లను పట్టించుకోకుండా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే రోడ్లన్నీ గుంతలమయంగా మారిందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం ఆయన నాదెండ్ల మండలం కనపర్రు నుంచి ఇర్లపాడులోని కేంద్రీయ విద్యాలయం వరకు ఉన్న రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.40లక్షలు నిధులతో ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గతంలో ఏ ప్రభుత్వం ఉన్నా రోడ్ల నిర్వహణ, నిర్మాణం, విస్తరణకు కనీస నిధులు కేటాయించేవారని, గత ప్రభుత్వం దానికీ మంగళం పాడిందన్నారు. దీని కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది కిలోమీటర్ల రోడ్లు ఇప్పుడు కనీసం గుంతలు పూడ్చే కార్యక్రమం కోసం ఎదురు చూస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రం గత ఐదేళ్ల కాలంలో 20ఏళ్ల వెనక్కుపోయిందన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమంలో ఇదేతరహాలో గ్రామీణ సమస్యలు ఎన్నింటినో తీర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి తలతోటిరాణి, టిడిపి మండల నాయకులు బండారి సత్యనారాయణ, తెలుగు రైతు ఉపాధ్యక్షులు గుర్రం నాగ పూర్ణచంద్రరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పల్లెపండుగ వారోత్సవాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - క్రోసూరు



మండలంలో జరిగే పల్లె పండుగ వారోత్సవాలను విజయవంతం చేయాలని క్రోసూరు మండల ఎంపిడిఓ మహేష్‌బాబు శుక్రవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుండి 20 తేదీ వరకు జరిగే పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలకు మండలానికి ఎంజిఎన్ఆర్ఆఇజిఎస్ నిధులు వచ్చాయని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, మండల ప్రజా పరిషత్, పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు షెడ్యూలు గురించి వివరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకము, మండల ప్రజా పరిషత్, క్రోసూరు మండలములోని 18 గ్రామ పంచాయితీలలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల షెడ్యూలు ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా నీటీ యాజమాన్య సంస్థ, పల్నాడు వారికి తదుపరి చర్యల నిమిత్తం సమర్పించారు. 14న బయ్యవరం, ఊటుకూరు, అందుకూరు, 15న అనంతవరం, ఆవులవారి పాలెం, పెరికపాడు, 16న పీసపాడు, తాళ్ళురు, ఉయ్యందన, 17న గరికపాడు బయ్యవరం, 18న క్రోసూరు హసనాబాదు, దొడ్లేరు, 19న విప్పర్ల, గాదెవారిపాలెం, బాలుమర్రు గ్రామాల్లో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ప్రజలకు అధికారుల దసరా శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి అని ఆయన పేర్కొన్నారు. దసరా పండుగ జిల్లా ప్రజలందరికీ మేలు చేయాలని, జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు.



పల్నాడు జిల్లా ప్రజల పోలీసు సిబ్బందికి పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ విజయదశమి పర్వదినాన్ని సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాశక్తి- బెల్లంకొండ



పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు దంపతులు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాశక్తి ప్రతిరూపమైన దుర్గాదేవిని పూజించి ఆరాధించే విజయదశమి పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగ విజయదశమి అని ఆయన పేర్కొన్నారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణతో ఆ ఆదిపరాశక్తి మనకు సదా స్ఫూర్తినిస్తుందన్నారు. ఆ జగన్మాత చల్లని దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం, సుఖ శాంతులు, సిరి సంపదలు చేకూరాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

పత్తిని సిసిఐ కేంద్రాలు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - మాచర్ల

పత్తి రైతులను ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, తక్షణం సిసిఐ కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని సిపిఐ మాచర్ల ఏరియా సెక్రటరీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కొమెర వీరాస్వామి భవన్‌లో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా పత్తికి రూ.7500 మద్దతు ధరగా ప్రకటించిన కేంద్రప్రభుత్వ ఆదేశాలు ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు ఎందుకు పాటించడం లేదో సమాధానం చెప్పాలన్నారు.ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే మద్యం దుకాణాల టెండర్ల విషయంలో నిర్దిష్ట సమయానికి పూర్తిచేయాలని ఉరుకులు పరుగులు పెట్టే పాలకులు, రైతుకు మద్దతు ధర ప్రకటించి అమలు చేసే విషయంలో నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. దసరా, దీపావళి నాటికే పంటలో మూడు వంతుల పత్తి రైతుల ఇంటికి చేరుతుందని, ప్రభుత్వాలు సిసిఐ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో క్వింటా రూ.5వేలకే దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. క్వింటా పత్తికి సుమారు రూ. 15 వందలు కూలి రేటు అవుతుందని, తక్కువ ధరకు అమ్మితే ఇక ఎరువులు, పురుగు మందులు పెట్టుబడుల సంగతి ఏంటని ఆయన ప్రశ్నించారు. కాలం కలిసి రాక నాలుగేళ్లుగా రైతులు నష్టాలను చవిచూసి అల్లాడిపోయారన్నారు. ఈ యేడాది సకాలంలో వర్షాలు కురిసి పత్తిపంట చేతికొచ్చిన సమయానికి పాలకులు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా పాలకులు సిసిఐ ద్వారా పత్తిని కొనుగోలు చేసి రెండు తెలుగు రాష్ట్రాల రైతాంగాన్ని ఆదుకోవాలని, పరిస్థితి ఇలాగే కొనసాగితే సిపిఐ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు వెనుకాడేది లేదన్నారు.



ఎక్సైజ్ స్టేషన్ పరిశీలన

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను స్టేట్ టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎం సుధాకర్ రెడ్డి, జిల్లా ఎన్‌పోర్సుమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవికుమార్ రెడ్డి, జిల్లా ఎన్‌పోర్సుమెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.సూర్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. పరిశీలన అనంతరం వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు. షాపుల దరఖాస్తులను ఏడు గంటల వరకు మాత్రమే తీసుకోవాలన్నారు. తరువాత 12 గంటల వరకు దరఖాస్తులకు టోకెన్ల కేటాయిస్తారన్నారు. 14వ తేదీ డ్రా తీయడం జరుగుతుందని వివరించారు. వారి వెంట సిఐ వి.శ్రీనివాసులు, ఎస్ఐ డిపి హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.



రతన్ టాటాకు ఘననివాళి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ప్రముఖ పారిశ్రామిక వేత్త పద్మ భూషణ్ అవార్డు గ్రహీత రతన్ టాటాకు స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం తన కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ధనవంతులలోనే ఒకరైన టాటా పేదల సంక్షేమం కోసం ఎంతో శ్రమించారన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో ఆయన చూపిన దాతృత్వం ప్రపంచ దేశాలను సైతం ఆకర్షించిందన్నారు. సేవా కార్యక్రమాలలో ఆయన ప్రత్యేక శ్రద్ధ వహించేవారని కీర్తించారు. ఆయన మృతి దేశానికే తీరని లోటని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలన్నారు. అనంతరం టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

మద్యం దరఖాస్తుల స్వీకరణ పూర్తి

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నోటిఫై చేసిన 10 మద్యం షాపులకు మొత్తం 287 దరఖాస్తులు వచ్చాయని గుంటూరు అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి, ఎస్‌టిఎఫ్ మంగళగిరి అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి రోజున అన్ని స్టేషన్‌లను సందర్శిస్తూ క్రోసూరు వచ్చినట్లు తెలిపారు. అంతా సాఫీగా సజావుగా సాగుతున్నట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో అప్లికేషన్‌లు వేసేట్లు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నామని తెలిపారు. మద్యం షాపులు సజావుగా నడిచేందుకు కృషి చేస్తామన్నారు. అక్టోబర్ 14వ తేదీన పల్నాడు జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ చేతుల మీదుగా వారి సమక్షంలో నరసరావుపేటలోనే ప్రకాష్‌నగర్‌లో ఉన్న టౌన్‌హాల్లో ఉదయం ఎనిమిది గంటల నుండి లాటరీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ లాటరీ ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ చేయబడుతుందని, ఎవ్వరూ అపోహలకు గురికావద్దని స్పష్టం చేశారు.అనంతరం స్టేషన్‌ను పరిశీలించారు. పెదకూరపాడులో 250 దరఖాస్తులు, ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం షాపులకు 238 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రోసూరు ఎక్సైజ్ సిఐ టి .తులసి, ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నూతక్కిలో ..



రేవేంద్రపాడులో

ప్రకృతి వ్యవసాయంపై నీతి ఆయోగ్ బృందం పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రకృతి వ్యవసాయ విధానాల వల్ల రసాయనాల వినియోగం తగ్గిపోతుందని, ప్రభుత్వం ఎరువులపై ఇచ్చే సబ్సిడీ భారం తగ్గితే ఆ మొత్తాన్ని రైతుల ప్రయోజనాలకోసం వినియోగించవచ్చునని నీతి ఆయోగ్ గౌరవ సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ చంద్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి ప్రకృతి వ్యవసాయాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని, ప్రకృతి వ్యవసాయం మరింతగా విస్తరించాలంటే ప్రకృతి వ్యవసాయ విజ్ఞానాన్ని పాఠశాల పాఠ్యాంశాల్లో చేర్చి పిల్లలకు బోధించాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ 'ఏపీసీఎన్ఎఫ్" (ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం) ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి విధానాలపై అవగాహన కోసం నీతి ఆయోగ్ గౌరవ సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ చంద్ నేతత్వంలో ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఈ బృందం శుక్రవారం గుంటూరు జిల్లాలోని మంగళగిరి మండలంలోని నూతక్కి, దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు గ్రామాల్లో పర్యటించి, ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగు చేస్తున్న వ్యవసాయ, ఉద్యాన పంటలను పరిశీలించారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల


మండలానికి విచ్చేసిన నీతిఆయోగ్ బృందం వ్యవసాయ విభాగం సలహాదారు డాక్టర్ రమేష్‌చంద్ ఆధ్వర్యంలో మండలంలో పర్యటించారు. రేవేంద్రపాడు గ్రామ పరిధిలో 15 మంది రైతులు కలిసి 15 ఎకరాల విస్తీర్ణంలో మూకుమ్మడిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించే వరి కాంప్యాక్ట్ బ్లాక్‌ను బృంద సభ్యులు సందర్శించారు. రైతులందరూ ఇంత పెద్ద మొత్తంలో ప్రకృతి వ్యవసాయం చేయడం హర్షించదగ్గ విషయం అని కొనియాడారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో బయో డైవర్శిటీ పద్ధతిలో అనేక రకాల పంటలు వేయడం వల్ల అనేక రకాల ప్రయోజనాలు కలుగుతున్నాయని, ముఖ్యంగా పురుగుల నియంత్రణ ఉంటుందని గమనించామన్నారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై తెలుసుకున్న అన్ని విషయాలను, రెండు రోజుల పర్యటన పరిశీలించిన అంశాలపై నివేదిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ఉన్న మార్కెటింగ్ సౌకర్యాలు, వాటికి అందుతున్న ధరల గ్రహించామని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రీమియం ధర చెల్లించాల్సి ఉందని అన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు డాక్టర్ డీవీ రాయుడు, చంద్రశేఖర్, గోపీచంద్, డాక్టర్ వరప్రసాద్, రామచంద్రం, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్ బాబు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, మంగళగిరి తహశీల్దారు సుభాని, దుగ్గిరాల తహశీల్దారు సునీత, వ్యవసాయ అధికారి పి.శిరీష, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాటిబండ్ల కృష్ణ ప్రసాద్ పలుకూరి శామ్యూల్ వాసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన ఎస్ఐగా మధు పవన్

ప్రజాశక్తి - పెదనందిపాడు



పెదనందిపాడు మండలం నూతన ఎస్సైగా అద్దంకి మధు పవన్ ఈరోజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో గుంటూరు పట్టాభిపురం స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న వీరు సాధారణ బదిలీల లో భాగంగా పెదనందిపాడు కు వచ్చినట్లు తెలిపారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది సహకారంతో కషి చేస్తానని తెలిపారు. స్టేషన్ సిబ్బంది ఎస్సై మధు పవన్ కు శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.



ఫోర్జరీ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - మేడికొండూరు

ఫోర్జరీ సంతకాలతో తమ భూములను ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మేడికొండూరు తహశీల్దారుకు పేరేచర్ల గ్రామస్తులు వినతిపత్రం శుక్రవారం సమర్పించారు.ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు మాట్లాడుతూ పేరేచర్ల గ్రామ పరిధిలోని 551, 554, 55, 550 అను సర్వే నెంబర్లలో 16 ఎకరాల 60 సెంట్లు భూమి ఉందన్నారు. ఈ భూమికి కల్లివరపు నాగయ్య మనవళ్లు ఏసోబు, యోనా, ప్రకాశం, సామేలు, ప్రకాశం కుమారుడు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు కుమారుడు నాగయ్య తదితరులు 16మంది వారసులుగా ఉన్నారన్నారు. తమకు తెలియకుండానే పోర్జరీ సంతకాలతో అన్యాక్రాంతం చేసి అనుభవిస్తున్నారని ఆవేనద వ్యక్తంచేశారు. ఆ ఆస్తికి నిజమైన వారసులమైన తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

మున్సిపల్ కార్మికులకు దసరా సరుకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో 20మంది మున్సిపల్ కార్మికులకు ఆ గ్రామ టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు దసరా సరుకులను అందజేశారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో దసరా పండుగను పురస్కరించుకుని ఈ కానుకలను పంపిణీ చేశారు. అందులో 12 రకాల నిత్యావసర సరుకులు ఉన్నాయి. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు మాట్లాడుతూ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో విజయదశమి సందర్భంగా నిత్యావసర సరుకులను అందించామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, షేక్ నాగూర్ వలి, కంచర్ల కోటేశ్వరరావు, జోరుగా దాసు, షేక్ అబ్దుల్ గఫూర్, వడ్డేశ్వరం అబ్రహం, షేక్ మస్తాన్‌బి పాల్గొన్నారు.

'ఎన్ఆర్ఐ'లో కార్డియాక్ కేర్ కొత్త సృష్టి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



గత నెల 30వ తేదీన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న 75 సంవత్సరాల వద్దునికి అత్యాధునిక ప్రక్రియ వినియోగించుకుని గుండె రక్త నాళాల్లోని కాల్షియంను సమర్థవంతంగా తొలగించి స్టంట్ అమర్చడం జరిగిందని వైద్యులు తెలిపారు. ఆర్బిటల్ అథెరెక్టమీ నిర్వహించి కాల్షియం మోడీఫికేషన్ చేసినట్లు ఎన్నారై వైద్యులు తెలిపారు. గుండెలోని మూడు రక్త నాళాల్లో జబ్బు తీవ్రత అధికంగా ఉండటంతో కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ చేయించుకోవాలని మొదట సూచించినా, చాకచక్యంతో వ్యవహరించి ఈ అధునాతన సాంకేతికతతో విజయవంతంగా స్టెంటింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ జాన్ సతీష్ మార్గదర్శకత్వంలో డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ తిరుపతిరావు కాంప్లెక్స్ ఇంటర్వెన్షన్ విజయవంతంగా నిర్వహించారు. ఇలాంటి క్లిష్టతరమైన మరియు అధునాతన వైద్య విధానాలు ప్రజలకు ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా ఈ అధునాతన చికిత్సలు చాలా తక్కువ లేదా ఖర్చు లేకుండా అందించబడతాయని తెలిపారు. అత్యాధునిక సంరక్షణ అందరికీ అందుబాటులో ఉంచుతున్న ఎన్ఆర్ఐ మేనేజ్మెంట్ కృషిని రోగులు మరియు వారి కుటుంబీకులు కొనియాడారు.

రూ.10 నోటు చూపి సెల్‌ఫోన్ చోరీ

ప్రజాశక్తి-తాడేపల్లి

కిందపడిన రూ.పది మీవేనా అంటూ ఓ యువకుడు ఉండవల్లి సెంటర్లో ఓ పెద్ద మనిషిని నమ్మించి జేబులోని సెల్‌ఫోన్ తస్కరించాడు. బాధితుడు తాడేపల్లి పోలీసులను ఆశ్రంచాడు. వివరాల మేరకు.. స్థానిక ఉండవల్లికి చెందిన సత్యనారాయణ ఇంటి నిత్యవసర వస్తుకొనుగోలు కోసం సెంటర్‌కి వచ్చాడు. తీరుగు ప్రయాణంలో గుర్తుతెలియని వ్యక్తి 'మీ జేబులో నుండి రూ.పది పడిపోయాయని' నమ్మబలికాడు. సత్యనారాయణ చూసి తనవి కావని చెప్పేలోపే పైజేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను తస్కరించి అక్కడి నుండి ఆ అగాంతకుడు మరో వ్యక్తి స్కూటర్‌లో పరారయ్యాడు. దీంతో బాధితుడు సత్యనారాయాణ పోలీసులను ఆశ్రయించాడు.

యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ వితరణ

ప్రజాశక్తి - తెనాలిరూరల్

ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ అండగా నిలుస్తుందని సంస్థ అధ్యక్షుడు షేక్‌సాధిక్ అన్నారు. ఓపెన్ హార్ట్ చికిత్స చేయించుకుని ఇంటివద్దే ఉంటున్న ఐతానగర్ ప్రాంతానికి చెందిన తెనాలి ఇస్సాకుకు యంగ్ జనరేషన్ టీం తోపుడు బండిని శుక్రవారం అందజేసి బాసటగా నిలిచింది. సంస్థ అధ్యక్షుడు సాధిక్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం ఎదురు మార్కెట్ సెంటర్లో ఇస్సాకు 32 ఏళ్ళు ముఠా కార్మికునిగా పనిచేశాడని, అనారోగ్య కారణంగా కారణంగా బైపాస్ సర్జరీ జరగడంతో కొంత కాలంగా ఇంటివద్దే ఉంటున్నట్లు తెలిపాడు. కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు కూరగాయల వ్యాపారానికి తగినట్లు తోపుడు బండిని అందజేసినట్లు సాధిక్ తెలిపారు. ఆపన్న హస్తాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు తమసంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది హరిదాసు గౌరి శంకర్, శివ పాల్గొన్నారు.

సంస్థ కోసం సమిష్టిగా పని చేయండి

ప్రజాశక్తి - తెనాలి

సంస్థ సమిష్టి ప్రయోజనం కోసం నిబద్ధతతో పని చేస్తే సంస్థతోపాటు ఉద్యోగులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తహశీల్దార్ కెవి.గోపాలకృష్ణ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు ఎస్ ఫోర్ హెల్త్‌కేర్ సొల్యూషన్స్‌లో శుక్రవారం దసరా వేడుకలను పురస్కరించుకొని ఆ సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ప్రొప్రైటర్ మంచికలపూడి సరోజిని అధ్యక్షతనలో ముఖ్యఅతిథి తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మహిళల ఉపాధి కోసం ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సంస్థను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అదే సమయంలో సిబ్బంది కూడా సంస్థ ప్రయోజనాలను కాపాడే విధంగా యాజమాన్యం విధివిధానాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. సిబ్బందికి యాజమాన్యానికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎం.సంపెంగరావు, నేల జయలక్ష్మి, ఎం.శేషగిరి, జె.అనుపమ్, డాని ఆశిష్, హోలి, సుహాస్, హన్విత్, వీఆర్వోలు కె.జార్జి థామస్, జి.నాగరాజు, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - చేబ్రోలు

అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శేకూరు గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్- క్రాఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.వెంకట్, పంచాయతీ మెంబర్లు శేకూరు మేఘన, సుద్దపల్లిజ్యోతి మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, సంపూర్ణ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కుటుంబాలలో ప్రతిఒక్కరూ బాలికల ఆలోచనలు, అభిప్రాయాలను గౌరవించి అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. అబ్బాయిలు, అమ్మాయిలను సమానంగా పెంచితే సమాజం మెరుగ్గా ఉంటుందని సూచించారు. బాలికలకు లింగ అసమానతలు, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. బాలికల అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేయాలని కోరారు. బాలలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే చైల్డ్‌హెల్ప్ లైన్ నెంబర్స్ 1098, డయల్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్ 181, 112, గురించి అవగహన కల్పించారు.



విజ్ఞాన్ వర్సిటీని సందర్శించిన జింబాబ్వే ప్రతినిధులు



జింబాబ్వే రాయబారి స్టెల్లా నొకోమోతో లావు రత్తయ్య, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

భారత్- జింబాబ్వే దేశాల మధ్య విద్య, పరిశోధనలు, అగ్రికల్చర్ రంగాలలో టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని భారతదేశంలో జింబాబ్వే రాయబారి స్టెల్లా నొకోమో అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో అకడమియాతో పాటు దౌత్యపరమైన అంశాల గురించి శుక్రవారం ఆమె చర్చించారు. ఈ సందర్భంగా జింబాబ్వే రాయబారి స్టెల్లా నొకోమోతో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, వివిధ విభాగాల డీన్లు, అధిపతులతో ఆమె ప్రత్యేక సమావేశమయ్యారు. జింబాబ్వే రాయబారి స్టెల్లా నొకోమో మాట్లాడుతూ విద్య, పరిశోధనలతో పాటు సాంస్కృతిక మార్పిడి, అగ్రికల్చర్ టెక్నాలజీ, పరస్పర సహకార అవకాశాల అన్వేషణ వంటి అంశాల గురించి చర్చించారు. ఉమ్మడిగా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఇరువురి మధ్య భాగస్వామ్యం పటిష్టమవ్వడంతో పాటు విద్యాపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. దీని ద్వారా విద్యార్థులకు, అధ్యాపక సిబ్బందికి అపారమైన ప్రయోజనాలు చేకూరుతాయని వెల్లడించారు. అనంతరం యూనివర్సిటీలోని రోబోటిక్, త్రీడీ ప్రింటింగ్ ల్యాబ్, అగ్రికల్చర్ ఫామ్, తదితర డిపార్ట్‌మెంట్‌లను సందర్శించారు. యూని వర్సిటీలో ఉన్న 152 మంది జింబాబ్వే విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై వారికి అందిస్తున్న వసతులపై సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరం మరింతమంది విద్యార్థులను విజ్ఞాన్ యూనివర్సిటీలో చేర్పించ డానికి సముఖతను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ స్టూడెంట్స్, ఫ్యాకల్టీ ఎక్స్‌చేంజ్, అకడమిక్, పరిశోధన, కన్సల్టెన్సీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్స్‌ను అభివద్ధి చేసుకోవడానికి అవగాహన ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వీటితో పాటు జాయింట్ మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లకు కూడా కృషి చేయాలని కోరారు. రాబోయే కాలంలో ఇరుదేశాల మధ్య సంబం ధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సరికొత్త టెక్నాలజీ, ఇండస్ట్రీ, అకడమియా ప్రోగ్రామ్స్‌ను రూపొందిచడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ముఖ్య అతిథిని విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, పాల్గొన్నారు.





రేపు ఇండియా పోస్టల్ రన్

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా అక్టోబర్ 13న ఉదయం 6 గంటలకు గుంటూ రులో ఇండియా పోస్ట్ రన్ నిర్వ హిస్తున్నట్లు గుంటూరు డివిజన్ పోస్టల్ సూపరిం టెండెంట్ వై.యల మందయ్య ఒక ప్రక టనలో తెలిపారు. ఈ కార్య క్రమాన్ని కేంద్ర కమ్యూ నికేషన్స్, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హాజరవుతారని తెలిపారు. ఈ రన్‌లో 5కె, 10కె, 3కె రన్స్ ఉంటాయన్నారు. 5కె, 10కె పరుగు కోసం పాల్గొనే వారికి ఆర్ఎఫ్ఐడి చిప్‌తో కూడిన బిఐబిఎస్ అందించబడతాయని, 3కె ఫన్ రన్ కోసం

సాధారణ బిఐబి మాత్రమే అందించబడుతుందన్నారు. ఈ పరుగులో పాల్గొనే వారికి టి.షర్ట్, ఫినిషర్స్ మెడల్, హైడ్రేషన్, న్యూట్రీషియన్ సపోర్ట్, వైద్యసదుపాయం ఉంటాయన్నారు. 5కె, 10కె పురుషులు, మహిళల విభాగంలో విజేతలకు రూ.2.40 లక్షల వరకూ నగదు రివార్డులు ఉంటాయన్నారు. ఈ పరుగు కోసం ఇప్పటి వరకూ 1100 మంది ఔత్సాహికులు నమోదు చేసుకున్నారని తెలిపారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు నేత వై నేతాజీ

ప్రజాశక్తి-గుంటూరు

త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటుకు అర్హులైన గ్రాడ్యుయేట్స్ అందరూ ఓటు నమోదు చేసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు దండా లక్ష్మీనారాయణ, వై.నేతాజీ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పాతగుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న వారికి పట్టభద్రులు మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 30 నాటికి మూడు సంవత్సరాల డిగ్రీ పూర్తి అయిన వారు అందరూ ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసినప్పటికీ నిబంధనల ప్రకారం ఎన్నికలు జరిగే ముందు ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించబడుతుందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అప్లికేషన్ ఫారాలు కావలసినవారు పాత గుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో, మండల కేంద్రాల్లో ఉన్న సిఐటియు కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో బి.లక్ష్మీనారాయణ, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



